

# చరిత్ర

ప్రతిమాదేవి

'అసలు మా ఒదినే బతికివుంటే వాడి కిన్ని అవస్థ లుండేవా? మీ దయా ధర్మ భిక్షకి వా డిట్లా పాకులాడవలసిన రాత మొహా నున్నది. అందుకే ఆవిద పోయింది. విధి విధానం తప్పించగలిగే దెవరు?' అన్నది సత్యవతి అక్కసుగా.

'మీ అన్నయ్య విధి విధానం మాట అటుంచు. నా సంగ తేం చూశావు? ఒక వేపు నా చెల్లెలి కూతురు పెళ్ళి, ఈ కుటుంబ పోషణ — నా చిన్న ఉద్యోగం!—ఇదీ నా పరిస్థితి. ఇందులో నే నెన్ని బాధ్యతలు నెరవేర్చగలనో చెప్పు. నా చెల్లెలి మాటకి వస్తే దానికి చెయ్యటం నా ధర్మం, మీ అన్నయ్యకి చెయ్యటం ఔదార్యం. నేనూ అంతంత మాత్రపు ధనికుడ్నే కాబట్టి ధర్మం నిర్వర్తించగలను కాని ఔదార్యం చూపలేను. నా మాట అర్థం చేసుకోవా లని నీ కుంటే చేసుకో; లేదా ఇట్లాగే సాధించు. నీ యిష్టం సత్యం!—'

సుదీర్ఘమైన ఉపన్యాసం ముగింపుకి రాగానే రఘురామయ్య కండువా బుజాన వేసుకుని వీధిగడప దాటాడు.

అంతవరకూ కన్నవారి వేపు వ్యక్తుల గురించి బాధపడుతున్న సత్యవతి మనసు భర్త దీర్ఘోపన్యాసానికి కించిత్తు వెలితి చెందింది. ఇంతవరకూ భర్త పరిస్థితి సక్రమమైన విధంగా తను అర్థం చేసుకోకపోవటం ఆశ్చర్యమే: నిజమే మరి; తమ తాహతుకి మించిన బాధ్యతలు నిర్వర్తించ మనటం పీడించటమే అవుతుంది. స్త్రీ ఆయిఉండి భర్తవిత నెలా పీడించగలదు?

భర్త మాటలకు సత్యవతి ఎంత ఆశ్చర్యపోయిందో అంతగానూ వ్యథ చెందింది. అతని మాటల్లోని నిజం అంగీకరించితే బాధ! అంగీకరించకపోతే బాధ! భర్తపై మోయలేని భారాన్నెలా మోపలేదో దిక్కులేని అన్ననీ పంపివేయ లేదు. ఈ పరిస్థితినుంచి దాటి బయట పడట మెట్లా?ఎట్లా ఈ వ్యథనుంచి తప్పు కోవటం ??

'ఏమిటే మీ ఆయన అంటున్నాడూ ? అంటూ బయటికి వచ్చిన విశ్వనాథం చెల్లెలి సమాధానానికెదురు చూడకుండానే 'అమ్మాయ్! నువ్వు బాధ పడకు. మా యిద్దరి సందునా నీకు ఇబ్బంది కలుగచేయటం నా కిష్టంలేదు. నేను రేపు తెల్లవారి బండిలో వెళ్ళి పోతాను...' అన్నాడు.

వెనకనుంచి తమ మాటలన్నీ అన్న విన్నాడని తెలిసి సత్యవతి చిన్నబుచ్చు కుంది.

"అది కాదురా అయన నీ సంగతి మాట్లాడటంలేదు. ఆయన మేనగోడలు పెళ్ళిసంగతి వచ్చి 'నే నింత భారం మోయగలనా?' అంటున్నారంతే'' అంది రానినవ్వు తెచ్చిపెట్టుకొంటూ.

నరాల బలహీనతతో వంగి గూడై పోయిన విశ్వనాథం పట్టెమంచం మీద కూర్చుని విషాదంగా నవ్వుతూ 'అహ! ఇప్పు డత నేదో అంటున్నాడని కాదు. అసలు చెబుతున్నాను. ఎంత ఉన్న వాళ్ళైనా కుటుంబం మీద కుటుంబం పోషించట మంటే ఎంత కష్టం చెప్పు !' అన్నాడు.

'ఇప్పుడు నిన్ను మేం పోషిస్తున్న దేమున్నదిరా, నీ కాస్తి లేదా? వికారివా? ఏమని నిన్ను మేం పోషిస్తున్నా మంటావు ?' అంది సత్యవతి ఆతనికి సర్ది చెబుతూ.

విశ్వనాథం నవ్వి 'ఆస్తికీ దీనికీ సంబంధం లేదమ్మా? ఏళ్ళ తరబడి మనిషి నింట్లో ఉంచుకుని తిండి పెట్టడం ఎంత కష్టం ? —' అన్నాడు.

సత్యవతి కా మాటతో పౌరుషమూ, బాధా కలిగింది. ఆమె వ్యథాకులిత అయి 'అన్నయ్యా' అన్నది.

విశ్వనాథం ఆమె వ్యథను తనే వారిస్తూ 'నువ్వు కోపం తెచ్చుకోకు సత్యం. రేపు నేను వెళ్తాను. చిన్ననాడు ఒక తల్లి దగ్గర ఎట్లా పెరిగామో, ఇప్పుడూ అదే భేదంలేని భావంతో చెబు తున్నాను. నావల్ల నీ కే ఇబ్బందీ కలగ కూడదమ్మా. నువ్వు పైకిచెప్పకపోయినా నాకు తెలుసు. కిట్టుగాడ్ని తీసుకుని రేపు వెళ్తాను నేను !' అన్నాడు.

సత్యవతి చాలా సేపు అతనికి సమా ధానం చెప్పకుండా ఊరుకుని తరువాత బాధగా 'పోనీ కిట్టుగాడ్ని అయినా అట్టే పెట్టు అన్నయ్యా' అన్నది.

'ఒద్దు సత్యం : వాడు నా కొడుకు. ఆడవాళ్ళలా పని చేసిపెట్ట లేనేమో కాని

ఏదో పచ్చడిముద్ద నాతోపాటే వాడూ తింటాడు. ఒద్దు. వాడ్ని ఎక్కడా అట్టి పెట్టను నేను.' అన్నాడు విశ్వనాథం స్థిర నిశ్చయంతో.

సత్యవతికి ఏమని జవాబు చెప్పాలో తోచలేదు. ఆమె కళ్ళనీళ్ళు పెట్టుకుని నేనేం చెప్పనురా అన్నయ్యా! ఇటు మొగుడు, అటు అన్న అంటూ అర్ధోక్తిలో ఆపేసింది.

విశ్వనాథం నవ్వి 'నువ్వు ఏమీ చెప్ప పద్దమ్మా! పరిస్థితి నాకు తెలుసు. అసలు మొదట్లోనే నువ్వు 'రా అన్నయ్యా!' అని పిలిచినప్పుడు నేను రాకుండా ఉండ వలసింది. కాదు. వచ్చాను. నీకు బాధ కలిగిస్తున్నానని తెలుసుకున్నాను. వెళ్ళి పోతాను. అంతే. ఇంతకీ నువ్వేదో చెప్పలేదనీ బతిమాల లేదనీ నేనేమీ అనుకోను సత్యం!' అని కాస్సేపు వూరు కుని 'ఇంతకీ మీ ఒదిన పోవడంతో నా అగచాట్లు బయట పడ్డాయి. ఉండగా తెలియలేదు' అన్నాడు విచారంగా.

ఆ మాటతో సత్యవతి గుండెల్లోని విషాదం ఒక్కసారిగా పెల్లుబికింది. ఆమె ఏడుస్తూ 'ఈ బుద్ధి ఒదిన బ్రతికి ఉండగా ఏమైపోయిందిరా అన్నయ్యా? అది లోలోపల ఎంత కుళ్ళికుళ్ళి ఏడ్చి చచ్చి పోయిందో కదా!' అన్నది.

విశ్వనాథంకూడా కళ్ళనీళ్ళు మరుగు పరచుకుంటూ 'నన్ను ఎత్తిపొడవకు సత్యం! ఆ విషయంగురించి నేనిప్పు డెంతకుమిలిపోతున్నానో నీకు తెలియదు బ్రతికిఉండగా మీ ఒదినని పెట్టిన క్షోభ అంతా ఇప్పుడు నేను పడుతున్నాను అన్నాడు గాద్గదికంగా.

సంజ ముసురుకొంటోంది. అప్పుడే ఆటలనుంచి తిరిగివచ్చిన కిష్టిగాడ్ని చూసిన సత్యవతి హృదయంలో చీకటి స్మృతుల నడుమ బాదాస్మృతి ఒకటి విరిసింది.

* * *

సరిగ్గా నిరుడీ రోజుల్లో ఇదే సాయం సమయాన, వేడివేడి నీళ్ళు కాచి ఒంటి మీద పోసి శుభ్రంగా ఒళ్ళు తుడిచి బట్టలు తొడిగి, అన్నం పెట్టి, తన చీరె కప్పి మేనల్లుడ్ని పట్టెమంచం మీద పడుకోబెట్టింది సత్యవతి. ఈ పను లన్నీ చేస్తున్నంత సేపూ ఆవిడ ఆ పిల్లవాడిమీద విసుక్కుంటూనే ఉన్నది.

'ఎవరైనా ఇట్లా చేస్తారుట్రా అమ్మా నాన్నా పెద్దవాళ్ళు! వాళ్ళ ఈడెక్కడ! నీ ఈడెక్కడ? గుద్దొచ్చి పిల్లని ఎక్కిరించిందట! ఇంత అఘా యిత్యంగా రైలుపట్టాల వెంటపడి నడిచి ఊరికివెళ్ళే కుర్రకుంక లుంటారా ఎక్క డైనా? పద! రేపే నిన్ను మీ ఊళ్ళో దించి నీ సంగతేమిటో కనుక్కుంటాను

మేనత్త అట్లా మందలిస్తూ ఉంటే మాటిమాటికీ చొక్కాతో కళ్ళనీళ్ళు తుడుచుకోవటంతప్ప మరేమీ చేయలేక పోయాడు కృష్ణుడు.

'అసలు నిజం చెప్పు! ఎందుకురా నువ్వు వచ్చేసిందీ?' సత్యవతి మేనల్లుడ్ని నిలదీసి అడిగింది.

"అమ్మని నాన్న కొట్టాడత్తయ్యా!' ఎంతో సంకోచంతో చెప్పాడు కృష్ణుడు.

'అమ్మని నాన్న కొడితే నీ కెందుకు? నీ కేమిటి సంబంధం? వెధవ పెద్ద మాటలూ నువ్వూను!' అని కోప్పడింది సత్యవతి.

కృష్ణుడు ఏడుస్తూ ఆమె ఒళ్ళో తల దాచుకుని 'కాదత్తయ్యా! ఎప్పుడూ కొడతాడు. ఇవాళ—' అంటూ ఆగిపోయాడు.

'ఊఁ ఇవాళ?' సత్యవతి కుతూహలం చంపుకోలేకపోయింది.

'ఇవాళ నాన్న అమ్మని పిలిచాడు. అమ్మ వెళ్ళింది. వెళ్తే— వెళ్తే—'

'ఊఁ, వెళ్తే??'

'లాగి చెంపమీద కొట్టాడత్తయ్యా—' కృష్ణుడు వాడి వయసు కందని బాధ జుగుప్సలతో సత్యవతి ఒళ్ళోకి ఒదిగి ఒదిగిపోయాడు.

వాడ్ని చూస్తే సత్యవతి గుండె నీరై పోయింది. ఆమె జాలిగా వాడి తల నిమురుతూ 'కొడితే నీ కెందుకురా నిన్ను కొట్టలేదు కదా'— అన్నది ఖేదంగా.

కృష్ణుడు బాధగా 'అదికాదత్తయ్యా, అప్పుడు నేను చూశానత్తయ్యా. అమ్మ ఏమీ మాట్లాడకుండా వచ్చి సంచి నా చేతి కిచ్చి బడికి వెళ్ళమన్నది..' అన్నాడు.

'అమ్మ బడికి వెళ్ళమంటే నువ్వేమో ఇటుపడి వచ్చావు, అవునా?— సత్యవతి మళ్ళీ మందలింపుగా అడిగింది.

కృష్ణుడు జవాబు చెప్పలేదు. అపరాధిలా మౌనం వహించాడు.

'తప్పురా కిష్టూ! అమ్మా నాన్నా ఏదో అనుకుంటారు! అవన్నీ నీ కెందుకు?





ఎక్కడ నేర్చుకున్నావు పెద్దమాటలూ! పెద్దఊహలూ!' — ఆమె వాడి పక్కన కూర్చుని ఒళ్ళు నిమురుతూనే మందలిస్తోంది. ఆ స్వరంలో ఎంత స్నేహపిచ్ఛలత, ఎంత ఆవేదన వ్యక్తమవుతున్నదో గ్రహించేపాటి వయసు వాడికి లేకపోయినా, ఆ ఒడిలో అవ్యక్తమైన ఏదో హాయి మాత్రం వాడికనుభవమౌతోంది.

మేనత్త మందలింపులు వింటూనే కృష్ణ దెప్పుడు నిద్రపోయాడో తెలియదు

వాడు నిద్రపోవటం చూసి సత్యవతి మెల్లిగా పక్కమీదనుంచి లేస్తూ 'పాపం! పిచ్చి వెధవ !' అనుకున్నది. ఆమె మన సంతా వాడు చెప్పిన విషయం గురించే నిండిపోయింది.

'పడుకున్నాదా ?'—మంచంమీదినుంచి లేస్తున్న సత్యవతిని చూసి అడిగాడు భర్త.

'ఊఁ.'

అతను నవ్వుతూ 'ఎట్లాగైనా ఈ రోజుల్లో పిల్లలకు అఘాయిత్యాలెక్కువ ! పెళ్ళాం కాబట్టి స్వతంత్రంకొద్దీ మీ అన్నయ్య కొట్టాడేమో, దానికింత రాద్ధాంతం చేయాలా ? అందులో లేవలేని స్థితిలో ఐక్క కోపం వస్తుంది. వెధవ ! వీడి ఈ డెంత? వీ డెంత?' అన్నాడు.

భర్తమాటల్ని ఒక పరిస్థితిలోఅయితే సత్యవతి అంగీకరించి ఉండేదేమో కాని ఇప్పుడు మాత్రం అంగీకరించలేక పోయింది.

'ఇవాల్టిదా ఈ కోపం! మా అన్నయ్య స్వభావం మీకు తెలియనిదా ఏమన్నానా? పాపం ! వాడితో మా ఒదిన కాబట్టి వేగు తోంది. పసివాడి మనసులో తండ్రిని గురించి దురభిప్రాయం ఏర్పడ కూడ దని వాడ్ని కోప్పడటమే కాని, అసలు మా అన్నయ్య ఎదుట ఉండి ఎవరూ వాడితోపడలేరు! అన్నదామె నిట్టూరుస్తూ.

అతను నవ్వి ఊరుకున్నాడు.

'పిల్లవా డిక్కడికి వచ్చాడని మా ఒదినకి మనిషి చేత కబురు చేశారా ? అని అడిగిందామె.

'ఆఁ.'

సత్యవతి నిద్రపోతున్న మేనల్లుడి వేపు చూసి దీర్ఘంగా నిట్టూర్చింది..

## 2

ఒక చేత్తో కృష్ణుడి చెయ్యి పట్టుకుని మరోక చేతిలో బట్టలసంచీ పట్టుకుని విసుక్కుంటూ తలుపు తీసిన విశ్వనాధాని కెదురుగా నిలబడింది సత్యవతి.

'నువ్వా ?' అన్నాడు విశ్వనాధం నిర్ఘాంతపోయి.

'ఆఁ. నేనే!—ఏం?' అన్న కళ్ళల్లోకి నిశితంగా చూసింది సత్యవతి.

విశ్వనాథం ఆ చూపులు తట్టుకోలే నట్లు ఎటో చూస్తూ 'రా లోపలికి !' అని మాత్రం అన్నాడు.

సత్యవతి లోపలికి అడుగుపెడుతూ 'ఒది నేది ?' అని అడిగింది.

'కిరసనాయిలు అయిపోతే తెస్తా నని బజారుకి వెళ్ళింది'—అపరాధిలా అయి పోయాడు విశ్వనాథం.

'కిరస నాయిలా ? ఒదిన వెళ్ళిందా ? పనిమని షేమైంది ?' సత్యవతి నిర్ఘాంత పోయి అడిగింది.

'పనిమనిషిని మీ ఒదినతీ సేసిందిగా?

'ఎందు కని ?'

'డబ్బు చాలటం లేదని !!'

'హుఁ' అంది సత్యవతి ఒక్కసారిగా.

'చివరికి కాపరాన్ని ఏ గతికి లాగావు అన్నయ్యా!' అన్నది వెగటుగా.

విశ్వనాథం మాట్లాడలేదు. కేవలం మొహం కందగడ్డ చేసుకోవటం తప్ప!!

'ఇడుగో! నీ సుపుత్రుడు! వచ్చి అరగంట అయినా వీడ్ని గురించి అడగవేం? మా ఊరు పడివచ్చాడు. ఎందుకో తెలుసా?'

విశ్వనాథం గాలిలోకి చూస్తూ నిశ్చింతగా 'ఆహాఁ, తెలుసు కాని ఎవరిచ్చారు నీకీ స్వతంత్రం ఇవన్నీ అడగటానికి?' అన్నాడు.

అతనా మాటలెంత తేలిగ్గా ఉచ్చరించినా అందులోని కటుత్వమూ, అవజ్ఞా సత్యవతి హృదయానికి సూటిగా నాటాయి.

ఆమె అవమానభారంతో కుంగిపోయి ఆశ్చర్యంగా 'అన్నయ్యా! నువ్వేనా ఈ మాట్లాడేది?' అన్నది.

ఈసారి విశ్వనాథం చెల్లెల్ని చూసి హుంకరించి లేచి లోపలికి వెళ్ళిపోయినాడు.

సత్యవతి కింకచేసేది లేకపోయింది. ఆమె బాధగా నిట్టూర్చి ఒదినగారి కోసం ఎదురుచూడసాగింది.

కాస్సేపటికి వీధి మొగదల కిరసనాయిలు సీసాతో శాంతమ్మ ప్రత్యక్షమైంది. వెలిసి డాగులుపడిన చీరెతో, చేతిలో సీసాతో వస్తున్న ఆమెను చూస్తే సత్యవతి గుండెలు ప్రేలిపోయాయి. అల్లారుముద్దుగా పెరిగిన, తల్లిదండ్రుల కేకైక పుత్రిక అయిన ఒదినగారు! మొగుడికోసం, సంసారం కోసం పిండి మరలకూ, కిరసనాయిలు బుడ్లకూ తిరగడమా?

ఇంటి వరండాలో ఆడపడుచుని చూడగానే శాంతమ్మ నడకవేగం హెచ్చించింది. తన పరిస్థితిలోని దైన్యాన్ని ఒక్క క్షణం విస్మరించి సంతోషంగా నవ్వుతూ 'నువ్వా ఒదినా ఎంతసేపైంది వచ్చి? ఏడీ కృష్ణుడు! అబ్బ! రాత్రి నువ్వు మీవూరు చేరాడని మనిషిచేత కబురు చేసేదాకా నా ప్రాణాలు ప్రాణాల్లో లేవనుకో! ఊరంతా గాలించాను. ఊహుఁ. కనిపించలేదు. ఏరా! కిష్టూ! అట్లా చెప్పకుండా వెళ్ళారు ట్రా? అత్తయ్యని చూడాలని ఉంటే నాతో చెప్పరాదూ? నాన్నగారో నేనో తీసుకు వెళ్ళేవాళ్ళంగా —' అంటూ గుక్క తిప్పుకోకుండా మాట్లాడేసింది.

సత్యవతి నవ్వి 'కులాసాగా ఉన్నావా ఒదినా' అని పలకరించింది ప్రేమగా.

'ఆఁ. లోపలికి రా! కాఫీ చేసిస్తాను. ఎంతసేపైందేమిటి వచ్చి? మీ అన్నయ్య చూడలా? ఏమండీ! సత్యవతి వచ్చింది. చూసారా!' అంటూనే 'నిన్న ఈ వేళకి ఊరంతా వెతుకుతున్నాను వీడికోసం.

కాళ్ళన్నీ అరిగిపోయా యనుకో ! ఏంరా క్రిష్టా ! ఏడీ వీడు ?—'

సత్యవతి అప్రయత్నంగా శాంతమ్మ పాదాలకేసి చూసింది. అవి పాదాలుగా లేవు. మర్రిపట్టెల్లా తప్ప !

కిరసనాయిలు సీసా గదిలో ఒక పక్కనపెట్టి శాంతమ్మ కుంపటి వెలిగిస్తోంది. ఆమె రూపాన్ని తదేకంగా పరిశీలిస్తున్న సత్యవతి ఉన్నట్లుండి ఉలిక్కిపడింది.

'ఒదినా ఇదేమిటి ? మళ్ళీ ఏమన్నా...?' అని అడిగింది కళ్ళు పెద్దవిచేసి చూస్తూ.

ఆమాటకి ఉలిక్కిపడి తిరిగిచూసిన శాంతమ్మ ఆడపడుచు ముఖంలో భావం గ్రహించింది.

క్షణంలో ఆమె ముఖం మ్లానమైంది. విచారస్వరంతో 'అవును ఒదినా ! కరువులో అధికమాస మంటారు ? అట్లా ఉంది నా బతుకు !' అన్నది.

వెంటనే సత్యవతి తన ముఖంలోని భావాలు మార్చేస్తూ 'అదేమిటి ఒదినా అట్లా అంటావు ? కరు వేముం దిప్పుడు నీకు ? పిల్లలు పుట్టే రోజుల్లో పుట్టరా మరి? అట్లా అనుకోకు' అంది లాలనగా.

శాంతమ్మకుంపటిమీదనీళ్ళు ఫిల్టర్‌లో పోస్తూ 'అంతేలే, అంత కంటె ఏమనుకుంటాను ?' అంటూ దీర్ఘంగా నిట్టూర్చింది.

సత్యవతి తగ్గుస్వరంతో 'సరేకాని అన్నయ్య నడిగితె కొప్పడతాడు కాని ఆ దావా విషయ మేమైంది?' అని అడిగింది.

'అవతలపక్షంవాళ్ళే గెలిచేట్లున్నారు' అన్నది శాంతమ్మ నిర్లిప్తంగా తలవంచుకుని డికాషన్ గిన్నెలో పోస్తూ.

సత్యవతికి ఆ మాటతో ఆఖరి ఆశ అంతరించింది. లాభంలేదు. అన్న కాపురం అన్నివిధాలా హీనస్థితికి దిగజారిపోయింది.

ఆమె బాధగా 'లాభం లేదు. అయిపోయింది. సంపాదించే తెలివితేటలు వాడికి లేవు. పైగా ఈ నరాల బలహీనత ఒకటి. ఇల్లెలా గడుపుతున్నావువదినా?—'

శాంతమ్మ జవాబు చెప్ప లేదు. మౌనంగా నవ్వి ఊరుకుని కాఫీ ఆడబడుచు ముం దుంచింది.

పైకి పొంగినా పరిష్కారం కనిపించని పరిస్థితులు అన్నగారివి. ఇది గ్రహించిన సత్యవతి ఎదుట ఉండి వారి బాధ చూడలేక ఆ రాత్రికి రాత్రే ఊరికి ప్రయాణం కట్టింది.

## 3

రెండు రోజుల తర్వాత కాబోలు; సత్యవతి పొద్దున్నే లేచి కుంపటి అంటించే ప్రయత్నంలో ఉండగా ఎవరో పొరుగింటావిడ 'ఏవమ్మా విన్నావాఈమాట?' అంటూ అతి విచారంగా మొహంపెట్టి ఇదేమిటి ? నీ కేమీ తెలియదా ? అయితే ఎందుకులే !' అని ఆ తర్వాత సత్యవతి

ఎన్నిసార్లో ఏమి టేమి టని అడిగినా 'ఏమీ లేదులే?' అంటూ వెళ్ళి పోయింది

కాని ఆ సందిగ్ధతలో ఇంతటి వజ్రా ఘాతం ఇమిడి ఉందని ఆ మెకు తెలియదు. కాని మరోగంట గడిచేసరి కల్లా అన్న పంపిన మనిషి ద్వారా విన్న వార్త సత్యవతిని నిశ్చేతనురాలిని చేసి వేసింది.

'ఇదేమిటి ? ఇదేమిటి ? ఎందుకు పోయిందీ? ఎలా పోయిందీ ఒదిన చచ్చి పోయిందా? ఏమైంది? ఏమైంది?' అంటూ ఏడవసాగింది.

కాని అప్పటికి వివరా లేమీ బయట పడలేదు. తీరా అన్నగారి ఊరు వెళ్ళాక పక్కింటి పనిమనిషి చెప్పిన విషయం ఆమె కెంతో బాధ కలిగించింది. కృష్ణుడ్ని దించి సత్యవతి ఊరికి వెళ్ళిపోయిన మర్నాడు పక్కింటివాళ్ళ పనిమనిషికి ఏదో ముట్టచెప్పి కడుపు పోవటాని కేదో మందు తెప్పించుకు తిన్నది శాంతమ్మ. కడుపు మాట అటుంచి అస లామెకూడా లేకుండా పోయింది.

ఈ విషయం పాపభీతిదలపని మనిషి. చేతులు జోడించుకుని ఏడుస్తూ, రహస్యంగా తనకి చెప్పినప్పుడు ఆ రహ స్యాన్ని బయట పడేసి చేయగలిగేది లేక పోగా, కాపరం ఇంకా బయటపడటమే అవుతుందని బాధంతా లోలోపల మింగి ఊరుకున్నది సత్యవతి. ఆమెకు ఆనాడు శాంతమ్మ 'కరువులో అధిక మాసంలా ఉంది నా బ్రతుకు?' అని వాపోయిన సంఘటన జ్ఞాపకం వచ్చింది. చివరికి ఇంత అఘాయిత్యం చేస్తుం దని కలలో కూడా అనుకో లేదు.

'—సత్యవతి కానాడుసంఘటనలన్నీ జ్ఞాపకం వస్తున్నాయి. దుఃఖావేశంలో తన తాహతు స్ఫురణకి రాలేదు ఆనాడు. భర్తకూడా ఆవేడిలో తన కోరిక నిరాక రించలేదు. అన్నగారినీ, మేనల్లుడ్నీ తీసుకువచ్చి తన యింట్లో అట్టేపెట్టు కున్నది.

కాని సహృదయత్వమూ, సత్కా ర్యాలూ చివరంటా సాగవు. అది ఇవాళ అనుభవ పూర్వకంగా తెలిసివచ్చింది సత్యవతికి.

'ఎక్కడో ఉన్నవాడ్ని నిన్ను కది లించి తీసుకువచ్చాముురా? మళ్ళీ ఇప్పుడు మావల్ల కాదంటున్నాము. నీ బాధ నీకు తప్పలేదు...' అంది సత్యవతి వ్యధగా.

బాగా చీకటిపడింది. ఇంకా పట్టె మంచంమీద అలాగే కూర్చున్న విశ్వనాథం చెల్లెలి మాటలకు నవ్వి 'నా కాస్తి లేదా? అని అడిగా డిందాక. ఆస్తి ఉంటే బావ బాగా నే చూ సే వా డే మో నన్ను! ఉన్నదంతా ఊరిపాలైందిగా' అన్నాడు.

అట్లా అనకురా అన్నయ్యా! ఆయన పరిస్థితికూడా కాస్త ఆలోచించు. హతురి పెళ్ళి చేయలేవని చెల్లెలి సతాయింపు లొకపక్క! ఒకపక్క వేలకట్నాలు

కుమ్మరిస్తే కానీ ఎవరూ ఇంటివేపు తొంగి చూడనైనా చూడటంలేదు. రోజులా ఎంతో గడ్డుగా ఉన్నాయి: ఈ పరిస్థిలో ఆయన్ని మాత్రం ఎట్లా అంటాము చెప్పు?' అంది సత్యవతి.

విశ్వనాథం జవాబు చెప్పలేదు. సరిగ్గా ఇలాగే శాంతమ్మకూడా తనామె నెన్ని బాధలు పెట్టినా తనను వెనకేసుకు వచ్చి మాట్లాడేది. అప్పుడదంతా నటన అన్నాడతను? కాని చెల్లెలి మొగుడు అదంతా ప్రేమ అని అంగీకరిస్తాడు. బహుశా!


'పరిస్థితులవల్ల కాదు. మనసుల్లోనే ఉంది బాధ. వ్యక్తులలో కాదు. స్వభావాల్లో ఉంటుంది.' అనుకున్నాడతను నిట్టూరుస్తూ.

* * *

ఆ మర్నాడు సూర్యుడి ఉదయమూ ఇటు అన్న నిష్క్రమణమూ ఒక్కసారి జరుగుతూఉంటే వెళ్ళిపోయే బండివేపు చూస్తూ 'ఒక్కసారి. ఒక్క మాట "నువ్వెందుకయ్యా వెళ్ళటం? నీవుమాకు భారమా?" అని అనలేకపోయారు. మళ్ళీ చాకిరికీ సలహాలకూ మాత్రం నేను కావాలి' అన్నది కళ్ళనీళ్ళతో సాధింపుగా సత్యవతి.

పక్కనే మంచంమీద కూర్చుని ఉన్న రఘురామయ్య ఆమె మాటలు విని కూడా విననట్లూరుకుని ముసుగుతన్ని పడుకున్నాడు.

— మానవుల సంకల్ప వికల్పాలకు సాక్షీభూతుడై సూర్యుడంత కంతకూ ఆకాశపు నడినెత్తినందుకుంటున్నాడు.—



రెప్పలగోడలు దాటి వేడి రాదు, కాంతితప్ప
లంకవంటి తోటలోన శంకలు లేని రంగుల కాంతి తప్ప
ఈ తోటకు శాశ్వతమాధవుడను నేను
తోటను నేను, నాలోనే ఉన్నది తోట
జ్వరతీవ్రతను కాచికాచి వడపోశాక
దారి లేని వేరు లేని తారులోంచి రంగులు విడదీశాక
కోరికల బూదిప్రోవును తడిపి, తడిపి
పాదులు చేసి రంగులతోట వేశాను
పరు లెవ్వరు చొరకుండా రెప్పలగోడలవెనుక దాచేశాను
జ్వరం పెరిగినకొలది
అధరధరణి ఎండి, మండి నెరియలు విచ్చిన కొలది
నా స్నాయువుల కాలువలవెంట మంటలు పారిన కొలది
తోట విరియబూస్తుంది. రంగులు పొంగుతాయి
నింగి నీలం, నెత్తుటి ఎరుపు, పచ్చిక పచ్చ
పూరేకుల చెక్కుల కెంపులలో జ్వరవారుణి
లోక మొక తోటౌతుంది. తోటే లోక మౌతుంది.
తోటలో చోటు లేని మిత్తవ జీవితపు అక్షరాల అచ్చుతప్ప
రాకుమారి వరియించిన గూనివాడు
కునికే పసికందులకు 'కథ కంచికి మన మింటికి',
అన్నట్టుగ నీతో ఒకటి చెప్పలేదు,
నా రంగులతోటలోకి అప్పుడప్పుడు నిన్ను తప్ప!
ఎవ్వరినీ రానివ్వను.

